

# అతిథి

గన్నవరం ఎయిర్‌పోర్టులో ఫ్లైట్ దిగాడు శంకరం. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంవల్ల వర్షం పడుతోంది. ట్రావెల్ ఏజెంట్ ముందుగానే బుక్‌చేసి పెట్టిన టాక్సీ రెడీగా వుంది.

"గాజుపాలెం తెలుసా నీకు?" టాక్సీలో కూర్చున్నాక డ్రైవర్ని అడిగాడు శంకరం.

"తెలీదు సార్ !"

"ఒంగోలుకి ఇవతలే వుంటుంది" డ్రైవర్ తల వూపాడు.

"అర్జెంట్‌గా వెళ్ళాలి"

"వర్షం జోరుగా కురుస్తోంది కదా సార్ ! జాగ్రత్తగా నడపాలి"

"సరే...సరే...అర్జెంట్ అన్నానని రిస్క్ తీసుకోవద్దు"

"అలాగేసార్ ! తొందరగా వెళ్ళడానికి ట్రై చేస్తాను" అన్నాడు డ్రైవర్.

"మీ వూరు వెళ్ళడానికి ఎన్ని గంటలు పడుతుంది?" అడిగింది భారతి.

"మీ వూరేంటి? మన వూరు అను. అత్తగారి వూరు నీది కాదా?" అన్నాడు శంకరం.

"ఎలా అవుతుంది? మీరు చిన్నప్పుడు పెరిగిన వూరు కాబట్టి మీ వూరవుతుంది. నేను పుట్టి పెరిగిన తెనాలే మా వూరు. మనం వుంటున్న బెంగళూరు మన వూరు" అన్నది భారతి.

"లాయర్ కూతురివి కదా ! ఆ మాత్రం అతి తెలివి వుంటుందిలే" అన్నాడు.

"మా నాన్నని అంటారెందుకు? నాకు స్వంత తెలివితేటలు వుండవా?"

"ఎందుకుండవూ? వాటికి మూలం అనేది ఒకటి వుంటుంది కదా !"

"సర్లెండి. మనం ఎన్నింటికి చేరతాం?"

"ఇప్పుడు పన్నెండవుతోంది. మూడింటికల్లా వెళ్తాం" అన్నాడు శంకరం.

మూడేళ్ళ మధువాణి భారతి వడిలో పడుకుని నిద్రపోతోంది.

కారు బెంజిసర్కిల్ దగ్గర సిగ్నల్ పడి ఆగింది.

"సార్ ! విజయవాడలో భోజనం చేస్తారా?" అడగాడు టాక్సీ డ్రైవర్.

"నాకు ఆకలిగా లేదు. భారతీ నువ్వు చేస్తావా?" అని భార్యను అడిగాడు శంకరం.

"నాకు తినబుద్ధి కావడం లేదు" అన్నది భారతి.

"మేము భోజనం చెయ్యం. నువ్వు కావాలంటే ఎక్కడైనా కారు ఆపి చేసెయ్" అన్నాడు శంకరం.

"నేను ఇంటి దగ్గర చేసే బయల్దేరాను సార్ !" అన్నాడు డ్రైవర్.

"ఐతే ప్రాబ్లమ్ లేదు" అన్నాడు శంకరం.

వర్షం జోరున కురుస్తోంది. రోడ్లమీద కార్లు, బైక్‌లు, ఆటోలు, బస్సులు, లారీలు బారులుతీరి పోతూనే వున్నాయి. జనం రెయిన్ కోట్లు వేసుకుని, గొడుగులు పట్టుకుని రోడ్ల మీద నడుస్తూనే వున్నారు. వానని ఎవరూ లెక్కచెయ్యడం లేదు. ఎవరి అవసరం వారిది.

"ఏమండీ మనం తిరుగు ప్రయాణంలో తెనాలి వెళ్దామా?" అడిగింది భారతి.

"పెద్దదినం అయ్యేవరకు మనం ఎవరింటికీ వెళ్ళకూడదనుకుంటాను" అన్నాడు శంకర్రావు.

"ఔనా?"

"మా చిన్నప్పుడు మా తాత చనిపోయినప్పుడు వూళ్ళో మా ఇంటిపేరు గల వాళ్ళెవరినీ పెద్దదినం అయ్యేవరకూ ముట్టుకునే వాళ్ళు కాదు. పొరపాటున ముట్టుకుంటే బావి దగ్గర తలస్నానం చేయించేవాళ్ళు. నేనైతే వరసైన వాళ్ళని 'ముట్టుకుంటా, ముట్టుకుంటా' అని బెదిరించేవాడిని. వాళ్ళు పారిపోయేవాళ్ళు" చిన్నప్పటి సంగతులు గుర్తు చేసుకున్నాడు శంకరం.

"ఇప్పుడు అంతగా ఏవీ పాటించడంలేదులెండి" అన్నది భారతి.

"ఊళ్ళల్లో నడిచిపోతూంటాయి. సిటీల్లో ఎక్కడ కుదురుతుంది?" అన్నాడు శంకరం.

భారతి తలవూపింది.

"సార్ ! ఈ పక్కనే దాబా వుంది. టీ తాగుతారా?" అని అడిగాడు డ్రైవర్.

"భారతీ టీ తాగుతావా?" అడిగాడు శంకరం.

"వద్దండీ శుభ్రంగా వుండవు. ఎటువంటి నీళ్ళతో చేస్తారో? ఏమిటో? ఎటూ ఇంటికి వెళ్ళిపోతున్నాంగా !" అన్నది భారతి.

డ్రైవర్ దాబాలోకి వెళ్ళి టీ తాగి వచ్చాడు. కారు మళ్ళీ బయల్దేరింది.

టైమ్ మూడు కావొచ్చింది.

జి.యన్.టి. రోడ్డులో మరొక ఇరవై కిలోమీటర్లు వెళ్ళి ఎడం పక్కకి తిరిగి రెండు కిలోమీట్లు వెళ్తే గాజుపాలెం వస్తుంది. 'ఇంకా పదిహేను, ఇరవై నిముషాల్లో చేరవచ్చు' అనుకున్నాడు శంకరం. భారతి తల వెనక్కి వాల్చి నిద్రపోతోంది. మధువాణి మిర్రర్‌లో నుంచి బైటకు చూస్తోంది.

ఇల్లు దగ్గరకు వస్తుందనే భావన కలగగానే శంకరంలో దిగులు మొదలైంది. ఇంటి దగ్గర దృశ్యం వూహించుకున్నాడు.

హాల్లో తండ్రి శవం చాపమీద పడుకోబెట్టి వుంటుంది. తల వెనుక దీపం వెలిగించి వుంటారు. శవంమీద పూలదండలు కప్పివుంటాయి. బంధువులు, మిత్రులు విచారంగా నిలడి, అక్కడక్కడా కూర్చుని వుంటారు.

తనని చూడగానే తల్లి, చెల్లెలు పెద్దగా ఏడుస్తారు. తమ్ముడు తనను కౌగలించుకుని వెక్కి వెక్కి ఏడుస్తాడు. మేనమామలు తమని ఓదారుస్తారు తండ్రి గురించి వాళ్ళు, వీళ్ళు గొప్పగా చెప్పుకుంటూ వుంటారు.

వీరరాఘవయ్యంటే ఈ చుట్టుపక్కల ఎంత పేరు?" అంటూ వుంటారు. కారు స్లో చేసి ఆపాడు డ్రైవరు. రోడ్డుకి అటూ, ఇటూ కూడా బస్సులు, లారీలు ఆగి వున్నాయి. డ్రైవరు కారు దిగి వెళ్ళి మళ్ళీ వచ్చాడు.

"సార్ ! వాగు పొంగిందంట. రెండు కిలోమీటర్ల పొడుగునా ట్రాఫిక్ జామైందట" అన్నాడు.

"ఇప్పుడెలా?" అన్నాడు శంకరం ఆందోళన పడుతూ.

"ఇప్పట్లో ట్రాఫిక్ క్లియర్ అయ్యేట్టు లేదట. పైన వర్షాలు బాగాపడ్డాయట. వాగు పైన బ్రిడ్జిమీద ఉధృతంగా ప్రవహిస్తున్నాయట వరదనీళ్ళు" అన్నాడు డ్రైవర్.

"అయ్యో !" అన్నది భారతి.

"అర్జంట్‌గా వెళ్ళాలా సార్" అడిగాడు డ్రైవర్.

"ఔను. మా నాన్నగారు సడెన్‌గా చనిపోయారు. నేనే పెద్దకొడుకుని. తలకొరివి పెట్టాలి. బెంగళూరు నుంచి వస్తున్నాను" శంకరం గొంతు బొంగురుపోయింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"అలాగా ! తీరా వూరు దగ్గరికి వచ్చేసరికి ఇలా జరిగింది. సాయంకాలానికి తగ్గిపోతుందేమోలెండి" సానుభూతి చూపిస్తూ అన్నాడు డ్రైవర్.

శంకరం వాచీవైపు చూశాడు. మూడుగంటలైంది.

చేసేదేంలేక అలాగే కారులో కూర్చున్నారు. శంకరానికి ఆకలి వేస్తోంది.

"భారతీ ! నీకు ఆకలి వెయ్యడం లేదూ?"

"లేదు లెండి" అన్నది.

"ఎందుకు వెయ్యదూ? ఉదయం టిఫిన్ కూడా సరిగా చెయ్యలేదు నువ్వు" సానుభూతిగా అన్నాడు.

భారతి బిస్కెట్ ప్యాకెట్లో మిగిలిన నాలుగు బిస్కెట్లు పాపకి తినిపించింది. ఫ్లాస్క్‌లో పాలులేవు. బిస్కెట్లు తిన్న తర్వాత "మమ్మీ ఆమ్ !" అన్నది మధురవాణి. భారతి, శంకరం వైపు చూసింది. రోజూ ఈపాటికి అన్నం తింటుంది పాప. బిస్కెట్లు ఆకలి తీర్చలేదని ఆమెకు అర్థమైంది.

"ఈ పక్కన ఎక్కడైనా హోటల్ వుందా?" డ్రైవర్ని అడిగాడు శంకరం.

"చూసొస్తాను సార్ !" అని కారు దిగి గొడుగు వేసుకుని వెళ్ళాడు డ్రైవర్. కాసేపటి తర్వాత తిరిగి వచ్చాడు.

"సార్ ! ఎక్కడా హోటల్ లేదు సార్ ! రెండు గంటల నుంచి ట్రాఫిక్ జామై వుందట. వాగు దాటితే గానీ హోటల్స్ లేవట. బస్సుల్లో వాళ్ళు అల్లాడిపోతున్నారు సార్ ! అంతా గందరగోళంగా వుంది. సాయంకాలానికైనా వాగు తగ్గుతుందో లేదో?" అన్నాడు.

"పోనీ వెనక్కి వెళ్తే ఎక్కడైనా హోటల్స్ వుంటాయిగా?" అన్నది భారతి.

"లేదు మేడమ్. మన కారు ట్రాఫిక్ మధ్యలో ఇరుక్కుపోయింది. ఎటూ కదలడానికి లేదు. మన వెనక అప్పుడే అరకిలోమీటరు బళ్ళు ఆగాయి" అన్నాడు డ్రైవర్. శంకరం నీరసంగా కళ్ళుమూసుకున్నాడు.

★ ★ ★

చీకటి పడింది. శంకరం డోర్ తీసుకుని బైటకు వెళ్ళాడు. డ్రైవర్ దగ్గర గొడుగు తీసుకున్నాడు. చాలా నీరసంగా వుంది. ఉదయం తిన్న టిఫిన్ తప్ప తర్వాత ఆహారం

లేకపోవడంతో చాలా ఆకలిగా వుంది. తినడానికి ఏమీ లేదు. భారతి ఎలాగో ఆకలికి ఓర్చుకుంటోంది. పాప మాట మాటకి 'మమ్మీ ఆమ్' అని గుర్తు చేస్తోంది. అతని పర్స్ నిండా నోట్లున్నాయి. వెయ్యి, ఐదు, వంద రూపాయల కరెన్సీ. కాని అవి ఇప్పుడు ఎందుకూ పనికిరావడంలేదు. కిలోమీటర్ల దూరం ట్రాఫిక్ జామ్‌లో దాదాపు అందరి పరిస్థితి అదే. మామూలు రోజుల్లో అయితే కొందరు హాకర్స్, 'టీ' సమోసాలు వంటివి తెచ్చి అమ్మేవారేమో? తుపాన్ భీభత్సంలో ఎవరూ బైటకు రావడంలేదు.

వర్షం తగ్గినట్లు అనిపించింది. సన్నగా చినుకులు పడుతూనే వున్నాయి.

'వాగు పరిస్థితి ఏమీ తెలియడంలేదు. తగ్గితే బళ్ళు బయల్దేరేవే కదా !' అనుకున్నాడు. శంకరం కొంత దూరం వెనక్కి నడిచాడు. నిలబడిపోయిన లారీలు, బస్సులు, కార్ల మధ్య నుంచి వెళ్తున్నాడు. కారులో వూరికే కూర్చునే బదులు ఆహారం కోసం ఏదైనా ప్రయత్నం చేయాలనిపించింది.

అక్కడవుళ్ళో తన కోసం అంతా ఎదురు చూస్తూంటారు. వాగు ఏ అర్ధరాత్రికైనా తగ్గితే బాగుండును. పాపం అందరికీ శవ జాగరణ తప్పేట్టు లేదు.

కొంత దూరం వెనక్కి నడిచిన తర్వాత దూరంగా కుడిపక్క కంకర దారి కనిపించింది. రెండు కిలోమీటర్ల లోపల రెడ్డిపాలెం అనే వూరు వుంది.

శంకరం నడక సాగించాడు. మినుకు మినుకుమని లైట్లు కనిపిస్తున్నాయి. కంకర కొట్టుకుపోయి గుంటలు పడివుంది. దారంతా బురద చుట్టూ చిమ్మచీకటి. మెరుపు మెరిసినప్పుడు దారి కనిపిస్తోంది. చేలల్లో కప్పలు బెక బెకలాడుతున్నాయి. శంకరం మొండిగా నడుస్తున్నాడు.

ఎలాగైనా పాపకి పాలు సంపాదించాలి. రెడ్డిపాలెంలో ఎవరొకరి ఇంట్లో పాలు దొరికే ఛాన్సు వుంది. ఊరి మొదట్లోనే పెంకుటిల్లు కనిపించింది. ప్రహరీగోడ తలుపులు మూసి వున్నాయి. గొళ్ళెంతో చప్పుడు చేశాడు. కొంచెం సేపైన తర్వాత ఒక యువతి తలుపు తీసింది.

"హమ్మయ్య" అనుకుంటూ లోపలకు ప్రవేశించాడు.

"ఎవండీ మీరు?" అని ప్రశ్నించింది ఆమె.

అతను వరండాలోకి వెళ్ళి గొడుగు మూసి గోడవారగా నిలబెట్టాడు.

"మాది పక్కవూరేనండీ. గాజుపాలెం. బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్నాను."

"మీకు ఏం కావాలి?" సూటిగా అడిగింది.

"అదే చెప్పబోతున్నాను. రోడ్డుకి అడ్డంగా వాగు పొంగింది. మధ్యాహ్నం నుండి ట్రాఫిక్ జామైంది. నా భార్య, పాప కారులోనే వున్నారు. అక్కడ తినడానికి ఏమీ దొరకడం లేదు. పాల కోసం పాప ఏడుస్తోంది" శంకరం గొంతు బొంగురు పోయింది.

"రమా ! ఎవరే వచ్చింది?" అంటూ నడివయస్సులో వున్న ఆమె వరండాలోకి వచ్చింది.

"ఎవరోనమ్మా ! పాలు కావాలంట" అన్నది రమ.

"రోడ్డు మీద ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కున్నావమ్మా ! కారులో పాప పాలకోసం ఏడుస్తోంది" అన్నాడు శంకరం.

"తల్లి పాలు లేవా పాపం" అన్నది ఆమె.

"పాపకి మూడేళ్ళమ్మా ! పాలు మానేసింది. కానీ మధ్యాహ్నం అన్నం పెట్టలేదు. పాలైనా తాగిద్దామని"

"అయ్యో ! పాపం బిడ్డ ఆకలితో ఎంత అల్లాడుతున్నదో... లోపలికొచ్చి కూర్చో బాబూ" అన్నదామె. శంకరం లోపలకెళ్ళాడు.

ఫోల్డింగ్ ఛైర్ వేసింది ఆమె. శంకరం కూర్చున్నాడు. హాలంతా పరికించి చూశాడు.

"ఏవూరు బాబూ మీది?" అడిగింది ఆమె.

"వాగుదాటితే మావూరేనమ్మా ! గాజుపాలెం"

"ఎవరబ్బాయివి?"

"వీర రాఘవయ్యగారబ్బాయిని"

రమ తల్లివైపు చూసింది. ఆమె కూతురు వంక చూసింది. ఇద్దరూ మౌనంగా వుండిపోయారు.

"మీ పేరేంటమ్మా" అడిగాడు శంకరం నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ.

"శాంతమ్మ" అన్నది.

శాంతమ్మ అక్కడ్నుంచి కదిలి వంట గదిలోకి వెళ్ళింది. రమ తల్లిని అనుసరించి లోపల్నుంచి మాటలు వినిపిస్తున్నాయి. కాసేపటికి ఒక సీసా నిండా పాలతో బైటకు వచ్చింది శాంతమ్మ.

"ఐతే మధ్యాహ్నం నుంచి మీకు తిండి లేదన్న మాట" అన్నది శాంతమ్మ.

"విజయవాడలో బయల్దేరినప్పుడు అక్కడే భోజనం చెయ్యాల్సింది. ఇంటికి చేరుకుంటాంలే అని వచ్చేశాం. తీరా వూరికి దగ్గరికొచ్చాక ఇలా జరిగింది. వాగు ఎప్పుడు తగ్గుతుందో వూరికి ఎప్పుడు చేరుకుంటామో... మా నాన్న..." అని నాలిక కర్చుకున్నాడు.

తన తండ్రి అక్కడ శవమై వున్నాడంటే, వీళ్ళు ఇంట్లోకి రానిచ్చినందుకు ఫీలవుతారేమో? మైల అని వాళ్ళకి పట్టింపులుంటాయనే ఆలోచన వచ్చి ఆ విషయం చెప్పలేదు.

"ఏంటి బాబూ !" అన్నది శాంతమ్మ.

"మా నాన్న మీకు తెలుసా అని"

"ఆ...తెలుసు బాబూ ! మా వూళ్ళో అందరికీ తెలుసు" అన్నది.

శంకరం జేబులో నుంచి పర్సు తీసి వందరూపాయలనోటు ఆమెకు అందిస్తూ "చాలా థాంక్సమ్మా !" అన్నాడు.

శాంతమ్మ ఒకడుగు వెనక్కివేసి "పాలు అమ్ముకునే అలవాటు మాకు లేదు బాబూ !" అన్నది.

"అందుకు కాదమ్మా ! సమయానికి ఇచ్చారని" అన్నాడు.

"ఐనా వద్దు" అన్నది.

"వస్తానమ్మా !" అని బయల్దేరాడు శంకరం.

"ఒక్క క్షణం" అని ఆమె వంటగదిలోకి వెళ్ళి బరువుగా వున్న క్యారీ బ్యాగ్ అతనికి తెచ్చి ఇచ్చింది.

"ఏమిటమ్మా ఇది?"

"ఈ రోజు మా ఆయన తద్దినం, గారెలు పరవాణ్ణం" అన్నది.

"ఎందుకమ్మా ఇప్పుడు?"

"మధ్యాహ్నం నుంచి ఏమీ తినలేదన్నారుగా. పాపం నీ భార్య ఆకలితో బాధపడు తున్నదేమో ! కారులో కూర్చుని తినండి. మంచినీళ్ళ సీసా కూడా పెట్టాను" అన్నది శాంతమ్మ.

ఆమె ఆప్యాయతకు, మంచి మనసుకు, శంకరం కరిగిపోయాడు. అతని కంటి వెంట నీళ్లు కారుతున్నాయి. ఆమె చూడకుండా కర్చీఫ్‌తో తుడుచుకుని వెళ్ళొస్తానని చెప్పి బయల్దేరాడు.

శంకరం ప్రహరీ గోడ దాటగానే రమ తలుపు మూసి ఇంట్లోకి వెళ్ళింది.

"ఏంటమ్మా ఇది. నాన్న చావుకి కారణమైన వీరరాఘవయ్య కొడుక్కి ఇంత మర్యాద చెయ్యాలా?" తీవ్రంగా అన్నది రమ.

"తండ్రి చేసిన దానికి కొడుకేం చేస్తాడే? ఆకలి అని ఇంటికి వచ్చిన వాడికి వట్టి చేతులతో పంపితే పాపం చుట్టుకుంటుంది" అన్నది శాంతమ్మ.

"హు ! పాపం...పుణ్యం" ఛీత్కారం చేస్తూ అన్నది రమ. పగవాడికి కూడా కూడు పెట్ట అదరించాలనే తల్లి ఆదర్శం జీర్ణించుకోలేకపోతోంది రమ. తరాల అంతరమో? మారుతున్న మానవ సంబంధాలో మరి?

"అతిథి ఎవరైనా దేవుడనుకోవాలి" అంటోంది శాంతమ్మ కూతురితో.

–ఆంధ్రభూమి మాసపత్రిక మే, *2008*